
# రాబోయే ప్రళయం

భాస్వతి



రాబోయే ప్రళయానికి సూచనగా ఆకాశము ఫెళఫెళమని ఉరిమింది అమావాస్య అర్ధరాత్రి.

ఆనందంగా చిందులు వేస్తున్న చీకటి రాక్షసి సహాయంతో తళుక్కుమని మెరిసిందొక మెరుపు. వర్షం జోరుగా కురవడం ప్రారంభించింది.

హఠాత్తుగా, నిర్మలమైన వాతావరణం ఇంత బీభత్సంగా మారడంతో గోపన్న ఉత్సాహం సన్నగిల్లింది. మెరుపు వెలుగులో దారిని చూచుకొని, జాగ్రత్తగా అడుగులువేస్తూ సాగిపోతున్నాడతను. విశాలమయిన అతని కళ్లల్లో కర్తవ్య దీక్షతోపాటు సమయమూ, స్థలమూ కలిగిస్తున్న భయమూ, ఆందోళనా ప్రస్ఫుటమవుతున్నాయి. అంత చలిలో కూడ నుదుటిమీద చెమటలు పట్టడమూ పళ్లలో పెదవి కరచిపట్టడమూ అతనిలోని డాంబికాన్ని వెల్లడిస్తున్నాయి. అతని ప్రాంతాలకు, మూడేళ్ల తరువాత తిరిగి రావడం జరిగినది. ఆ ప్రాంతాలలో చెప్పుకోదగిన మార్పులు లేకున్నా, సమయము అతనికి "దారి తప్పానేమో" నన్న శంకను కలిగిస్తూంది.

కాళ్లలో ముళ్లూ, చలికి గజగజ వణుకుతున్న శరీరం, అతన్ని తిరోగమించమని వేడుకుంటున్నాయి. గ్రామంలో ఎదిపింది ఎదటా చేసిన సవాలు అతన్ని వెనక్కు పోనీయడంలేదు. అయినా గ్రామం దాటి చాల దూరం వచ్చేశాడు. ఇప్పుడు ముందుకు వెళ్లినా, వెనుకకు మళ్లినా ఒకే దూరమవుతుంది. అతనిప్పుడు స్మశానానికి చేరువలో ఉన్నాడు.

ఏమిటేమిటో శబ్దాలు! అవి నక్కల ఊళలో, గుడ్లగూబల అరుపులో, దయ్యాల సంగీత సాధనో! అవన్నీ కలిసి నిశ్శబ్ద నిశీధిని మరీ భయంకరం చేస్తున్నాయి.

కాళ్లక్రింద పడిన కప్ప ఒళ్లు గగుర్పాటు చెందేట్టు చేసింది. కాలికి ఏదో రాయి తగిలి బొటనవ్రేలు చిట్లింది. కాలు ఎత్తి చేత్తో పట్టుకుంటే వెచ్చగా చేతికి తగిలిన ద్రవం, మెరుపు వెలుగులో ఎర్రగా మెరిసింది.

ఎందుకొచ్చిన బాధ యిది? కోరి అపాయాన్ని తెచ్చుకున్నాడు తను.

ఎందుకు?

ఎవరికోసం?

రత్తి!

చిమ్మ చీకటిలో మెరుపులా రత్తి అతనికి ఆశాకిరణం. జీవనతార అతని వలపుల రాణి.

రత్తితో తన ప్రణయానికి ప్రళయంలాంటివాడూ, తన ఆశలను నిర్వీర్యపరచి అడుగడుగునా అడ్డు తగులుతూ నిస్పృహను కలిగిస్తున్నవాడూ, ఈ చీకటి, స్మశానం కలిగిస్తున్న భయాన్ని ద్విగుణీకృతం చేస్తున్నవాడూ అయిన రంగడు.

తాడి రంగడు!

గ్రామంలో మంచివాళ్లందరికి పెద్దవాడయిన రంగడు. అయినా,

"నువ్వులేని ఈ నిరాశా వాతావరణంలో, అనుక్షణం నిన్నే స్మరిస్తూ నీకోసం తపిస్తూ, నీ రాకకై నిర్నిమేష నేత్రాలతో ధారాపాతంగా కురిసే కన్నీటితో ఎదురు చూస్తూ, ఈ మూడేళ్లు భారంగా, మూడు యుగాలుగా గడిపాను...." అన్న భావన కళ్లల్లో వెల్లివిరుస్తూంటే రంగడి అమానుష చర్యలనూ, బెదిరింపులనూ లెక్క చెయ్యని గాంభీర్యము ముఖంలో ప్రజ్వలిస్తూంటే.

తన కౌగిలిలో, లోకాన్ని మరచి హాయిగా విశ్రాంతిగా కళ్లు మూసుకొని ముద్దుగా "మావా" అని పిలిచే రత్తికోసం చచ్చినా ఫరవాలేదు. తల్లి తండ్రులెవరో తెలియని అనాధబాలకుణ్ణి చేరదీసి పెంచిన నాయుడు గారిని, దొంగతనం అంటగట్టి ఇంట్లోంచి తరిమివేసిన నాయుడుగారి కుమారుడు

గంగాధరం, తనకు జీవితమంటే తెలియ జేసినవాళ్ళు!

నాయుడుగారిది వెన్నలాంటి మనసు అయినా గయ్యాళి భార్యనూ పట్నంలో చదువుకుంటూన్న కొడుకునీ ఎదిరించలేక తను, నిర్దోషి అని తెలిసినా వారించలేక, తన నిస్సహాయతకు కృంగిపోయాడు.

పుట్టినప్పటినుండి తన గుణగణాలు తెలిసిన తోటివారు గంగాధరాన్ని నమ్మారు తన్ను "దొంగ" అన్నారు.

పాడులోకం!

అమాయకుడైన తనకు దొంగతనం అంటగట్టింది విశ్వాసఘాతకుడని పేరు పెట్టింది. గ్రామంలో తలెత్తుకు తిరగలేక తను పట్నం పారిపోయాడు. ఆ పాపిష్టి గ్రామంలో మళ్ళీ అడుగుపెట్టరాదని తీర్మానించుకుని బయలుదేరూ ంటే

వెళ్ళొద్దని జాలిగా బతిమాలే రతి కళ్ళలో సుళ్ళు తిరిగే కన్నీళ్ళు తన నిజాయితీ తాలూకు అహాన్ని కరిగించలేకపోయాయి.

ముక్కూ మొహం తెలియని పట్నంలో మూడేళ్ళు గడిపాడు తను బస్టాండులో కూలీగా, హోటల్లో క్లీనరుగా... అష్ట కష్టాలు పడ్డాడు

కాలం కనికరించింది.

తనకూ మంచి రోజులు వచ్చాయి. తన జీవితంలోనుంచి చీకటి పారిపోతూంది.

బ్రతికినంతకాలం ధైర్యం చెయ్యలేని నాయుడుగారు అవసానదశలో. తన్ను పిలిపించారు పట్నమంతా గాలించి గంగాధరమే తన్ను వెదికి గ్రామానికి తీసుకవెళ్ళాడు. లేవలేని స్థితిలో ఉన్న నాయుడుగారు కళ్ళు తెరచి చూచి ఎదురుగా కనుపించిన గోపన్నను చూచి కన్నీళ్ళు కార్చాడు ఆ కన్నీటికి ఆనందం పశ్చాత్తాపము రెండూ కారణాలే! తను "బాబయ్యా" అని నాయుడిగారి ప్రక్కన కూర్చోబోతే లాగబోయిన గంగాధరాన్ని ఉరిమిచూశారు నాయుడు గారు

"గంగూ! గోపీ ఎవరో తెలియదు నీకు! వాడు నీకు.. అన్న.. వాడి తల్లికి నేను తీరని ద్రోహం..." నోటిలోంచి వెలువడుతున్నట్టున్న ఆ మాటలు గోపన్ననూ గంగాధరాన్ని, అతని తల్లినీ, అక్కడే గుమిగూడి ఉన్న పెద్దమనుషుల్నీ చకితుల్ని చేశాయి.

"ఇదా నాయుడుగారు గోపన్నని పెంచడంలో, ఇప్పుడు పిలిపించడంలో అంతరార్థం" అనుకున్నారు గ్రామస్థులు.

పశ్చాత్తాపం దహిస్తున్న గంగాధరం కంఠం "అన్నయ్యా" అన్న ఒక పదాన్ని పలికింది. అందులో అమృతం చిలికింది. ఆత్మీయత కురిసింది.

గోపన్నకు నాయుడుగారిపై కోపం లీలగా ఏర్పడి మరుక్షణం అంతరించింది

భార్యా బిడ్డల రోదనలతో, గ్రామస్థుల హాహాకారాలతో, చావు బాజాల విషాదరాగాలతో మెల్లగా సాగిపోయింది నాయుడిగారి మృత కళేబరం .

మళ్ళీ తనకు గ్రామ ప్రజల ఆదరం, గౌరవం గంగాధరం సోదర ప్రేమ. నాయుడుగారి ఆస్తిలో వాటా . . లభించాయి..

కాని వీటన్నిటికన్నా విలువయినది, రతి! రతి తనకు లభించింది. దాన్ని చూసి రంగడికి కన్నెర్ర! దుర్మార్గుడు.

నాయుడుగారి మరణంవల్ల కలిగిన ఆవేదనతో, తను జ్వరపడితే

నాయుడుగారు దయ్యమయ్యారనీ, తన్ను భయపెట్టడం వలన తను జ్వరపడ్డాడనీ దుష్ప్రచారం సాగించాడు

తనకు దయ్యాలంటే నమ్మకంలేదు భయం అంతకన్నా లేదు పట్నంలో ఉండగా ఎన్నిసార్లు రాత్రిపూట స్మశానం ప్రక్కగా రిక్షా త్రొక్కలేదు! తనకు ఎన్నడూ దయ్యాలు తారసపడలేదు.

అసలు దయ్యాలంటూ ఉంటే గదా, భయపడటానికీ!

రచ్చబండవద్ద అదే మాట అన్నాడు తను రంగడితో!

"మేకపోతు గాంభీర్యాలేం కొదవ" అని ఈసడించాడు తన్ను

అక్కడ చేరిన నలుగురూ వాడి పక్షమే మాట్లాడారు

తనకు ఉద్రేకం పెరిగిపోయింది

"ఇదంతా మీ భ్రమ! ధైర్యంగలవాడెవ్వడూ దెయ్యాలున్నాయని ఒప్పుకోడు" అన్నాడు తను.

"ఓయబ్బో! మా పెద్దసాలిగాడు వచ్చిండురోయ్! పహిల్వాన్ మస్తాను సాబంతటోడు చీకట్లో దయ్యాలని సూసి గుండె పగిలి సచ్చిండు అడికన్నా గొప్పోడివా నువ్వు?" అన్నాడు రంగడు రెచ్చగొడుతూ.

"ఏనుగంత లావుండగానే సరా? నీమంత ధైర్యం ఉండాలిగాని" అన్నాడతను.

"[illegible] ఇదే పతిరోజు కాయ్ రాజా! అమాశనాడు, అద్దరేతిరికాడ సోసానం పక్క నుండే దయ్యాల సింతసెట్టుకాడికి ఒంటిగా ఎల్లి, సెట్టు మొదట్లో సీల దిగ్గొట్టొస్తే నువ్వు గెల్సినట్లు! అపుడు నాను దయ్యాల్లేవని ఒప్పుకుంటూ నా మీసం తెగ్గొస్తా! రత్తికి నీకు మనువు కుదిర్సి, నీ పెళ్ళిలో కర్రసాము సేస్తా" అంటూ ఉద్రేకంగా పంతాలు పలికాడు రంగడు.

తన గుండెల్లో రాయి పడింది. అనవసరంగా లేనిపోని గొడవ తెచ్చుకొంటిని. ఇప్పుడు తగ్గితే నలుగురిలో నవ్వులపాలు. ఏంజేసేదబ్బా! రంగడు తన్నగలు, అర్ధ మవుతూనే ఉంది స్మశానములో చీకట్లో ఏదయినా సూసి భయపడిపోతానని తనే గెలుస్తానని వాడి నమ్మకం. తరువాత నలుగురిలో తన్ను అవమానించి రత్తిని చేజిక్కించుకుందామని వూహ.

"ఏమయినా సరే! కాని" మ్మని తనూ పందెం అంగీకరించాడు రత్తి వెళ్ళొద్దని మొత్తుకున్నా

గంగాధరం ఎంత నచ్చచెప్ప చూసినా ..

తలలు నెరసిన పెద్దలు భయపెట్టినా.

"దయ్యాలనేవి లేవు. ఇదంతా మన మనస్సులోని భయం కలిగించే భ్రమ. నన్నేవీ ఏమీ చెయ్యవు" అన్నాడు తను.

"వూరుకోమ్మంటే! ఈ రాత్రి వెళ్ళి సీల గొట్టాలంటే అడి పొగ రెట్టుతుంది వాడి పీడ వదలటంతో సరా!" అని రత్తని లాలించి బయలుదేరాడు తను వూరునుంచి కొంతదూరం వచ్చాడో లేదో తగులుకుంది వెదవ్వాన

మళ్ళీ ఆకాశం ఫెళఫెళమని ఉరిమింది వెంటనే పెద్ద శబ్దంలో పిడుగుపడి ఏదో చెట్టు కూలిపోయింది ఆ శబ్దానికి ఉలిక్కిపడి ఆలోచనాలోకంలోంచి బయటపడ్డాడు గోపన్న

అక్కడక్కడా [illegible] ఉన్న [illegible] ధులు "ఆ ప్రేమ [illegible]" అన్న లోకోక్తిని చెబుతున్నాయి

బారులుతీరిన సైన్య మధ్యంలో పెద్ద అంబారీపైన ఉన్న మహారాజులాగ, చిన్న చిన్న చెట్లు ఇరువైపులా ఉన్న ఆ పెద్ద చింతచెట్టు మెరుపు వెలుగులో గోపన్నకు కనిపించింది.

గ్రామ ప్రజలు తనకు దయ్యాల చింతచెట్టు అని పేరు పెట్టినందుకు

# ఇదిగో కాల్గేట్ వారి... బ్రిస్క్ టూత్ పేస్టు



**విరివియైన నురగతో పళ్ళుతోముకుని క్రొత్త ముత్యపు తెల్లదనం పొందండి!**

ఇదిగో కాల్గేట్ బ్రిస్క్— శ్రేష్ఠమైన దంతధావన పదార్థములను ఉత్పత్తి చెయ్యడంలో ప్రపంచ మంతటా గొప్ప అనుభవము గడించిన సంస్థ అందించు క్రొత్త టూత్ పేస్టు.

ఆరోగ్యవంతమైన జీవనానికి పళ్ళు అత్యంత పరిశుభ్రముగా ఉండాలనీ, మీ చిరునవ్వును శోభాయమానం చెయ్యడానికి అద్భుతమైన ముత్యపు తెలుపును కూర్చాలనీ మీ దంత వైద్యుడు మీకు చెబుతాడు. మరి, శుభ్రమైన దంతముల కోసం సక్రమంగా కాల్గేట్ బ్రిస్క్‌తో బ్రుషుతో తోముకోవడమే.

పరిపూర్ణముగా మీ దంతములను శుభ్ర పరచుకోవడానికి కాల్గేట్ బ్రిస్క్ యొక్క చురుకుగా చొచ్చుకొని పోయే విరివియైన నురగను శాస్త్రీయ పద్ధతుల్లో కనిపెట్టారు. ఇది సాటిలేనిది!



టూత్ బ్రషుకూడా చేరలేని చోట్ల యిది అద్భుతముగా పనిచేసి పంటి కాంతిని పోగొట్టు పైపొరను తొలగించి క్రొత్త ముత్యపు తెల్లదనం వచ్చేలాగా మీదంతములకు మెరుగు దిద్దుతుంది!




అద్భుతమైన క్రొత్త ప్రభాత' పరిమళాన్ని ఆనందించండి. కాల్గేట్ బ్రిస్క్ యీ రోజే కొనండి!

CBTP.G.1 TEL.


## రాబోయే ప్రళయం

ఉన్మత్తుని కోపంలా పెరిగినట్లుం ఆ చింతచెట్టు.

గమ్యానికి చేరువయ్యేకొద్దీ గోపన్నలో ధైర్యం సన్నగిల్లసాగింది. ఏదో తెలివి భయం అతన్ని ఆవేశిస్తూంది.

వర్షం కొద్దిగా తగ్గుముఖం పట్టింది. ఈదరగాలి వీస్తూంది.

కప్పల బెకబెకలు ఎక్కువయ్యాయి.

త్రిభుజశీర్షాల్లాగ ఉన్న మూడు సమాధుల మధ్యన ఆగాడు గోపన్న. ఆ సమాధులలో అన్నిటికన్నా పెద్దది నాయుడుగారిది. అప్రయత్నంగా వెలువడిన కన్నీటిని తుడుచుకొని చేతులు జోడించాడు గోపన్న.

"కన్నెపిల్ల మది దోచి, ఆమె యువ్వన సంపద అనుభవించి, ఫలితంగా ఆమె గర్భవతి అయితే, లోకులామెను "కులట" అని నిందిస్తూ కాకుల్లా పొడుస్తూ కారు కూతలు కూస్తుంటే, నలుగురి ఎదుట నిలబడి నిజాన్ని ఒప్పుకునే ధైర్యంలేక నలిగిపోయాను. గంగి నిన్ను ప్రసవించి చని పోయింది. ఆమెను చేరుకున్నాను— ఆమె నన్ను క్షమించింది" అంటున్న నాయుడు గారి ఆకారం ఎదురుగా ఉన్నట్లు అనుభూతి కలిగి గోపన్న శరీరం గగుర్పొడిచింది. వెంటనే తేరుకుని కర్తవ్యం, గుర్తుకు తెచ్చుకుని ముందుకు సాగాడు. దయ్యాల చింతకు అర ఫర్లాంగు దూరంలో ఉన్నాడతడు. కాళ్ళక్రింద బడిన ఒక ఎముక బురదలో కూరుకుపోయింది.

కాలం కుంటివాడిలా సాగిపోతూంది.

గమ్యం చేరిన గోపన్న జేబులోంచి మేకు తీసి చేతిలో పట్టుకొని రాతికోసం నేలమీద తచ్చాడ్డం మొదలుపెట్టాడు.

చేతి కేదో తగిలింది. తీసుకున్నాడు.

అది పుర్రె అని గుర్తించగానే భయంతో వణికిపోయాడు. దాన్ని దూరంగా విసిరి వేశాడు. మళ్ళీ వెతగ్గా, అదృష్టవశాత్తు రాయి దొరికింది.

ఎవరో దగ్గినట్లూ, ఉచ్ఛ్వాస నిశ్వాసాల శబ్దం వినిపించింది. అతని వళ్ళు జలదరించింది. రోమాలు నిక్కబొడుచుకున్నాయి. ధైర్యం తెచ్చుకుని చుట్టూ చూశాడు. ఎవరూ కనిపించలేదు. భయం ఇనుమడించింది. అడుగులు తడబడ్డాయి. చెట్టు మొదట్లో వంగి, వణుకుతున్న చేత్తో మేలను చెట్టుకు ఆనించి పట్టుకొని కుడిచేతిలో రాయిని ఎత్తాడు. హఠాత్తుగా అతనిమీది కెవరో దుమికారు

అతని నరాలు బిగుసుకుపోయాయి. ఇంత లావైన చేతులు అతని గొంతు నులుము తున్నాయి. విడిపించుకోవాలని ఎంత ప్రయత్నము చేసినా, లాభంలేకపోయింది. నోట మాట రాలేదు. చేతిలోని రాయి క్రింద పడింది. ఒక్క మూలుగు మూలిగి అతను కుప్పగా కూలిపోయాడు.

నిర్దాక్షిణ్యంగా అతని గొంతు పిసికి చంపిన ఆకారం అతని శరీరాన్ని చెట్టు మొదట్లోకి లాగి పడవేసింది. తరువాత మేకు వెదికి గోపన్న పంచను చెట్టు బెరడుపై నుంచి దానిమీద మేకును దిగగొట్టి, కొద్దిగా పంచెను చించి "హు" అంది నిట్టూర్పు కాబోలు. తరువాత ఎటో వెళ్ళిపోయిందా ఆకారం.

వర్షం పూర్తిగా ఆగిపోయింది.

దయ్యాల చింతచెట్టు తన మొదట్లో చచ్చి పడిఉన్న గోపన్న శవంమీద జాలిగా కన్నీళ్లు కార్చడం మొదలుపెట్టింది.

నులకమంచంపైన నిద్రపట్టక అటూ ఇటూ పొర్లుతూంది రత్తి.

"గోపన్నమావ ఈసరికి పాశానం సేరుకుంటాడు." అనుకుంది.

"ఎంత మొత్తుకున్నా యినుకోలేదు. ఏమవుద్దో! దయ్యాల గొడవ మధ్యన ఈడి కెందుకంట ?"

"పట్నమోసపోడు. ఆడీ దార్లన్నీ మరిచిపోయుంటాడు. దారి తప్పిందేమొ."

"ఆడికి నేనంటే ఎంత మోజు. నారాణీ అని అక్కున జేర్చుకుంటాడు. ఆడి గుండెల మీద తలెట్టి తొంగుంటే ఆకలిదప్పులుండవ్. తమ కులంలో ఆడు అందరికన్న సక్కనోడు. ఈ ఎదవ సచ్చినోడు రంగడి మూలాన ఈ పీడ వచ్చిపడింది గందా! ఆ ఎదవకి దారంట ఆడది పోతే సాలు, గుడ్లు మిటకరించి సూత్తాడు. తనూ గోపన్నమావా కలిసిఉంటే వాడికి కడుపుమంట. ఎన్నోసార్లు "ఇదో! రత్తి! ఆ పట్నమాసపోణ్ని నమ్మకు. నీపేన ఎన్నో ఆశలు పెట్టుకొన్న ! నన్ను కాదని గోపన్నను సేసుకున్నావంటే మీ యిద్దరి సంగతీ తేలుస్తా! ఆఁ జాగరత్త!" అని బెదిరించాడు. బొత్తిగా బయంసేదు ఆడికి. దొంగ సచ్చినోడు. ఆడు తన కుళ్ళు బుద్ధితోనే నాశనమవాల. గోపన్నమావ సేమంగా తిరిగి రావాల. గంగమతల్లీ, మావకు నీవే దిక్కు. ఎల్లగాకన్నా ఇనకుండా వెళ్ళిండు. ఈ ముదనష్టపాన తగులుకుంది. ఆడు తడిసిపోయుంటడు. జెర మొనస్తదేమొ. మందియ్యడానికి రామయసామి ఉన్నాడో లేదో ! పట్నం పోయినాడేమొ."

మగతనిద్ర పట్టిన రత్తికి ఏదో చప్పుడు విని ఉలికిపడి లేచింది. మంచం దిగి బుడ్డి దీపం పెద్దది చేసి నలువైపులా కలియజూసింది. ఉట్టిపైనున్న వెన్న కుండ నేల మీద పడింది. విజయగర్వంతో వెన్నను నాకుతున్న పిల్లి రత్తిని చూసి పారిపోయింది.

రత్తి మనసుకు ఇది అపశకునంలా తోచింది. ఆమె హృదయం బాధగా మూల్గింది. క్షణంలో తెప్పరిల్లుకొని తలుపు తీసుకొని వీధిలోకి పరుగెత్తింది.

నాయుడిగారింటిముందు గంగాధరం కనిపించాడు రత్తికి.

"గోపన్నమావ వచ్చాడా...." రొప్పుతూ అడిగింది రత్తి.

"ఇంకా లేదు. పాలేళ్లను పంపాను చూసి రమ్మని" అన్నాడు గంగాధరం.

ఎదురుగా పరుగెత్తుకొస్తున్న పాలేరుకు ఎదురు వెళ్ళారు రత్తి, గంగాధరం.

"బాబయ్యా"... పాలేరు కంఠం వణికింది. రత్తి ఆదుర్దా ద్విగుణీకృతమయింది.

"ఏమయింది ?" గర్జించాడు గంగాధరం.

"గోపనబాబు సచ్చి పడుండాడు.. సెట్టు కాడ...."

తూలి పడిపోయిన రత్తినీ, నిశ్చేష్టుడయిన గంగాధరాన్నీ జాలిగా చూశాడు అప్పుడే ఉదయించిన సూర్యభగవానుడు. వెనువెంటనే కర్తవ్యం గుర్తుకు వచ్చినవాడిలా, రథారూఢుడయ్యాడు రాత్రంతా వర్షంలో తడిసి వణకుతున్న భూమాత చలి తీర్చడానికి.

* * *


గోపన్న శవాన్ని ఆప్యాయంగా ఆలింగనం చేసుకొంటున్నాడు అగ్నిహోత్రుడు.

ఎదురుగా చెట్టుక్రింద ముఖాన్ని చేతులో దాచుకొని వెక్కివెక్కి ఏడుస్తున్నాడు గంగాధరం.

నిర్జీవ ప్రతిమలా నిలబడిపోయింది రత్తి. హృదయంలో మండే మంటలకి కన్నీళ్లు కూడా ఇగిరిపోయాయి.

కళ్లవెంట ధారాపాతంగా నీళ్లు కారుతుంటే చితివైపు తదేకంగా చూస్తూ కూర్చున్నాడు రంగడు

"నిన్న ఇయ్యాల్టప్పుడు జడలో గన్నేర



"మీరొక్కరే సినిమాకి వచ్చినందువల్ల ఆటవేయడం మానేసాం. మీ డబ్బు వాపసు తీసుకోండి !"

వున్న తీరిమి తనను దగ్గరకు తీసుకొన్న గోపన్నమావకు నూరేళ్ళు నిండాయి'' లేచి నిలబడింది రత్తి.

''మావా! నేనూ నీకాడికి వస్తున్నా'' అని వెర్రిగా అరిచి, చితి కేసి పరుగెత్తిన రత్తిని రంగడు వేగంగా వెళ్ళి ఆపాడు.

''వదులు నన్ను! నాను ఆడితో పోతా'' పెనుగులాడింది రత్తి.

''ఏందే రత్తీ! పోయినోళ్ళ కోసం మనమూ పోతామా! నామాట ఇను.''

గంగాధరమూ, రామయ్య పంతులూ, వెంకటరెడ్డీ అందరూ చితి వద్దకు వచ్చారు

''చూడు రత్తీ! కాస్త మనసు కుదుట పరుచుకో! మన అందరం ఏదోనాడు పోయే వాళ్ళమే. కాస్త ముందు వెనకలా! అంతే! వాడికీ మనకూ ఋణం తీరింది అందుకే వద్దన్నా వినకుండా రాత్రి బయల్దేరాడు

''లడు నేకుండా నానెట్టా బతికేను బాబూ! ఆడెంట నేనూ పోతా నన్నడ్డ కండి. మీాకు దణ్ణమెడ్తా'' రత్తిలో దుఃఖం కట్టలు తెంచుకున్న నదిలా ప్రవహించింది

''బుద్ధి గడ్డితిని పందె మొట్టింది నాను యమునికాడికి పంపినట్లు సెట్టుకాడికి పంపింది నాను ఈ పాపమంతా నాది నేనూ అడితోనే పోతా!'' రంగడు చిరికేసి తిరిగాడు

రామయ్యపంతులు సైగతో తలార్లు రత్తినీ, రంగణ్ణి బలవంతంగా తీసుకెళ్ళి పోయారు

''మనిషి పుట్టినపుడు లోకం ఆనంద పడుతుంది బ్రతికున్నంతకాలం ఏడిపిస్తుంది చనిపోయినపుడు సానుభూతితో కన్నీళ్ళు కారుస్తుంది ఎంత విచిత్రమైనదీ లోకం''

''గంగమ్మకి పుట్టడం మూలాన, నాన్న గారి లాంటి స్థితిమంతుడి కొడుకైనా ఎన్ని కష్టాలు పడ్డాడు. బ్రతికినంతకాలం సుఖమనేది ఎరుగడు. తీరా, కష్టాలు తీరే సమయంలో కోరి మృత్యువులో లీన మయి నాడు.'' అనుకున్నాడు గంగాధరం.

''నిన్నటిదాక ఆడంటే మండిపడే రంగడు పయాల ఇంతగా మారిపోయిండు. ఆణ్ణి తనే పంపినంతగా బాధపడిండు. మంచోడు సస్తే కటికోడి గుండె కూడా కరుగుద్ది గామోను.'' అనుకున్నారు పాలేళ్ళు.

''రంగ డన్నట్లు మేకు దిగవెయ్యడంలో పంచెమీాద మేకు దిగవేసి వెనక్కు తిరిగి ఉంటాడు. పంచె లాగినట్లయేసరికి గుండె పగిలి సచ్చింటాడు. ఇంత పిరికి ఎదవలకి పందేలూ, రోసాలూ ఎందుకంట?'' అనుకున్నారు నూనూగు మీసాల కుర్రకారు.

వీళ్ళ ఆలోచనలేవీ ఖాతరు చెయ్యకుండా తన పనిపూర్తిచేశాడు అగ్నిహోత్రుడు.

''బాబూ! మీరయినా ఆడికి సెప్పండి గోపన్నను పొట్టనెట్టుకున్నాను అంటూ కూడూనీళ్ళు మానుకొని కుమిలిపోతుండాడు బాబూ!'' గంగాధరం కాళ్ళుపట్టుకుంది రంగడి తల్లి మంగమ్మ.

రచ్చబండ వద్ద సమావేశమయారు గ్రామపెద్దలు

''చూడురంగా! ఇప్పుడు నిన్ను ఈ చెట్టు క్రిందికి పిలిపించింది నేను హఠాత్తుగా కొమ్మవిరిగిపడి నువ్వు చనిపోతే అందుకు నేను కారణమంటావా?'' రామయ్య పంతులుగారు అడిగారు. కాదని తలవూపాడు రంగడు

''అలాగే, ఈ ప్రపంచంలో ఏది ఎలా జరగాలో నిర్ణయించేది భగవంతుడు కాబట్టి గోపన్న చావుకి ఎవరూ బాధ్యులుకారు అవన్నీ మరచిపోయి సుఖంగా వుండు.''

గంగాధరం మనసులో రత్తి మెదిలింది

రత్తికి కబురంపాడు గంగాధరం

పెద్దమనుషులూ, ఆడా, మగా, చిన్నా పెద్దా అంతా బలవంతం చేశారు రత్తిని.

''నా మీద ఏమాత్రం గౌరవమున్నా నా మాట కాదనకు. ఇందువల్ల గోపన్న ఆత్మశాంతిస్తుంది. రంగడికి నువ్వంటే ఇష్టమేగా'' ఊరందరి అభిప్రాయ ప్రవాహవేగానికి రత్తి మనసనే గడ్డిపోచ కొట్టుక పోయింది

''శుభస్య శీఘ్రం'' అన్నారు పంతులు గారు

*　　*　　*

ఆరోజు నరకచతుర్దశి. ఊరంతా సంబరాలతో మునిగితేలుతూంది. ఈ సంబరాలతో తనకు సంబంధం లేనట్లు కళా విహీనంగా వుంది రంగడి యిల్లు.

నులకమంచంపై వళ్ళు తెలీకుండా పడి వున్నాడు రంగడు. వళ్ళంతా మశూచికం బొబ్బలతో భీభత్సంగా వుంది అతని ఆకారం బాధతో మూలుగుతున్నాడతను. రాత్రంతా సేవచేస్తూ, రంగడి బాధ చూడలేక ఏడుస్తూ అలిసి నులకమంచానికి ఆనుకొని మగతనిద్ర పోయింది రత్తి.

''రత్తీ.'' జీవంలేని ఆ పిలుపుకు ఉలికిపడి లేచింది రత్తి.

''ఏం మావా''

రంగడు బదులు పలకలేదు. ''ఏం కావాల...'' అంటూ అంటూ రంగడిపై చెయ్యివేసింది. చేతికి మసూచి బొబ్బలు తగిలి రత్తి ఒళ్ళు గగుర్పొడిచింది. రంగడు బాధగా మూలిగాడు. మంగమ్మ నిద్ర లేచింది ఆ మూలుగు విని.

''సూడత్తా! ఆడేందో కలవరిస్తుండాడు'' రత్తి కంఠంలో ఆదుర్దా ధ్వనించింది.

''నన్ను చమించు గోపన్నా! రత్తి కోసం నేను పాపం చేశాను. నా పాపానికి బగవంతుడు సిచ్చ యిదించినాడు...'' చేతులూ కాళ్ళు చిగబట్టి బాధగా గొణిగాడు రంగడు.

''మావా! నేను రత్తిని...కళ్ళుతెరు.'' రంగడు వినిపించుకోలేదు ''వస్తున్నా గోపన్నా! నేను నీకాడికే వస్తున్నా! నీ కాళ్ళట్టుకొని చమాపణ సెప్పుకుంటా. ఇడిచి పెట్టండి నన్ను. సెబుతుంటే మీక్కాదూ? నేను గోపన్న కాడికిపోవాల.''

రత్తి మంగమ్మా దిగులుగా ఒకరివేపు ఒకరు చూసుకొన్నారు. మంగమ్మ ఏడుస్తూ వైద్యుడి కోసం పరుగెత్తింది.

''మావా'' గొంతుపెగల్లేదు రత్తికి

కాసేపు అయింట్లో మౌనం లపరించింది.

రంగడు కళ్ళుతెరిచి రత్తిని చూశాడు ఆమె కళ్ళలో ముత్యాల్లా మెరుస్తున్న నీటిని చూశాడు.

''రత్తీ! ఏడుస్తున్నావా! నా కోసరం? నేను పాపిని రత్తీ! నీకు అన్యాయం సేసిన రాచ్చసుణ్ణి! గోపన్నను నీకు కాకుండా సేశాను. ఊళ్ళో వాళ్ళందర్నీ నాటకాలాడి మోసం సేసినాను. లబ్బా.'' రత్తి మాట్లాడలేదు. రత్తి చెయ్యి తన చేతుల్లోకి తీసుకొని బాధతో అతికష్టం మీద అన్నాడు. 'నీమకయినా సెరుపు సేయని గోపన్నను ఆరేతిరి గొంతుపిసికి సంపిన పాపిని రత్తీ.'' తలత్రిప్పి రత్తి ముఖం చూశాడు గోపన్న.

కళ్ళు మూసుకొని ధ్యానముద్రలో వున్న యోగినిలా వుంది రత్తి. అతని మాటలు విన్నదో లేదో మరి

నాలుగేళ్ళుగా నరకచతుర్దశి రోజున గంగమ్మ గుడి ముందు రంగడి అధ్వర్యాన జరుగుతూ వచ్చిన కుస్తీపోటీ ఈ ఏడాది జరుగలేదు.

దీపావళి చిన్నబోయింది! ●